విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, మంగళవారం 18, మార్చి 2025

అర్హులైన పేదలకు ఇంటి పట్టాలివ్వాలి

విశాలాంధ్ర - బేతంచెర్ల : మండల పరిధిలోని అంబాపురం గ్రామంలోని ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి పట్టాలను తక్షణమే మంజూరు చేయాలని సోమవారం తాహశీల్దార్ కార్యాలయం ముందు సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు మాట్లాడుతూ పేద ప్రజలకు కూడు, గుడ్డ,నీడ,కనీస వసతులను కల్పించాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యం వహించి పేద ప్రజల మీద రాజకీయ పెత్తనం చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తుందని గతంలో అధికార పార్టీకి చెందిన వారికి మాత్రమే ఇంటి స్థలాలు కేటాయించడం ఎంతవరకు సమంజసం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి పేదలకు మూడు సెంట్ల చొప్పున నిరుపేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం మండల ఎంపీడీవో ఫజుల్ రెహమాన్, తహశీల్దారు ప్రకాష్ బాబులకు వినతిపత్రం అందజేయగా వారు స్పందిస్తూ పూర్తిస్థాయిలో విచారణ చేసి అర్హులైన లబ్ధిదారులకు వీలైనంత త్వరగా ఇంటి పట్టాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మోట రాముడు, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి శివయ్య, జిల్లా సమితి సభ్యులు సంజీ వులు, నారాయణ, సూర్యప్రతాప్, కుమార్, అబ్బాస్, రామ్మోహన్, మనోహర్, మధు, శివనాగయ్య, బేతంచెర్ల మండల సహాయ కార్యదర్శి తాలూకా తిరుమలేష్, ఏఐఎస్ ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉద య్, ఎర్రగుడి రాముడు, అంబాపురం గ్రామ నాయకులు సోమన్న, నాగేశ్వరరావు, శ్రీరాములు, భాస్కర్, నగేష్, రమేష్, మద్దిలేటి, మహమ్మద్, సురేష్, దస్తగిరి,ఎల్లకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు బెర్లకు నిప్పు

విశాలాంధ్ర - బనగానపల్లె : మండల పరిధిలోని కాపులపల్లె గ్రామంలో పొగాకు బెర్లకు నిప్పుట్టుకోవడంతో గ్రామానికి చెందిన నెమలి వెంకటసుబ్బయ్య కుమారుడు నెమలి వెంకట కృష్ణయ్య చెందిన పొగాకు బెర్లు అగ్నికి ఆహుతి అయ్యింది. ఆదివారం మధ్యాహ్నం 3.30 సమయంలో ఎవరులేని సమయంలో మంటలు చిలరేగడం గమనించిన గ్రామ ప్రజలు ప్రక్కనే ఉన్న ఎస్సార్ బీసీ కాలువ నుండి బిందెల ద్వారా నీరు తెచ్చి మంటలను అదుపు చేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. అగ్ని ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ తులసి రెడ్డి ప్రమాద స్థలాం చేరుకొని బాధితుని పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అర్బన్ సీఐ ప్రవీణ్ కుమార్ ప్రమాద స్థలాన్ని పరిశీలించి బాధితుల మేరకు ఫిర్యాదు నమోదు చేసుకున్నారు. నెమలి వెంకట కృష్ణయ్య మాట్లాడుతూ తను కౌలుకి పొలం తీసుకొని పొగాకు పండించడం జరిగిందని రెండున్నర గంటల సమయం తర్వాత కలంలోని తన భార్య భోజనానికి ఇంటికి రాగ కక్షపూరితంగానే నిప్పుటించడం జరిగిందని వాపోయారు. తనకు సుమారుగా రూ.1,50వేలు మెర నష్టం వాటిల్లింది ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల జిల్లాలో నేటి నుంచి జరుగుతున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల సందర్భంగా నంద్యాల జిల్లా ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా ఎస్పిజి హైస్కూల్ పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి పరీక్షలు జరుగు విధానాన్ని, పరీక్ష కేంద్రం వద్ద గల భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం పరీక్షలు జరిగే తీరును అక్కడ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పరీక్ష కేంద్రాలు వద్ద విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ ఆదేశించారు. పరీక్షా కేంద్రాల చుట్టుపక్కల ఉండే జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లు పరీక్షలు ముగిసిన వరకు తెరవడానికి వీలు లేకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నందున విద్యార్థులను, అక్కడ విధుల్లో ఉన్న సిబ్బంది మినహా ఇతరులను అనుమతించరాదని సూచించారు. జిల్లా ఎస్పీ వెంట డిఇఓ సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలి

విశాలాంధ్ర - డోన్ రూరల్ : ప్రజల నుండి వచ్చే అర్జీలను పరిశీలించి తగిన పరిష్కారాలు చూపించే దిశగా కృషి చేస్తామని తహశీల్దార్ నాగమణి అన్నారు. స్థానిక మండల తాహసిల్దార్ కార్యాలయంలో సోమవారం నాగమణి మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు ఆయా గ్రామాలకు సంబంధించిన విఆర్ఓలు అన్ని రకాల అంశాలను పరిశీలించి సమస్య ఉంటే పరిశీలించి తగిన పరిష్కారాలు చూపించాలని తెలిపారు. ప్రభుత్వం అధికారికంగా ప్రకటించిన ప్రజా ఫిర్యాదుల వేదిక ద్వారా ప్రజల నుంచి వచ్చే అర్జీలను, వినతులను స్వీకరించి వాటికి తగిన ఆధారాలు ఉన్నట్లయితే అక్కడికక్కడే పరిష్కార మార్గాలను చూపుతామని నాగమణి అన్నారు. మండల సర్వేయర్ జగదీష్ పాల్గొన్నారు.

నలుగురు విద్యార్థులు గైర్హాజరు

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : మండలంలో 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా సోమవారం ప్రారంభమయ్యాయి. లాంగ్వేజ్ తెలుగు పరీక్షకు నలుగురు విద్యార్థులు ఆయా పరీక్ష కేంద్రాలలో గైర్హాజరు అయినట్లు మండల విద్యాధికారి అబ్దుల్ కలాం తెలిపారు. మండల వ్యాప్తంగా కొలిమిగుండ్లలో రెండు, అంకిరెడ్డిపల్లి1, తిమ్మనాయుని పేట 1 పదో తరగతి పరీక్ష కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు మొత్తం 566 మంది ఉండగా, మొదటి రోజు తెలుగు పరీక్షకు నలుగురు ఆయా సెంటర్ల హాజరు కాలేదు. ఒక్కొక్క సెంటర్ నుండి ఒక్కొక్కరు పరీక్షకు విద్యార్థులు హాజరు కాలేదని ఎంఈఓ తెలిపారు.

గొర్రెలకు మేతగా మిర్చి పంట



విశాలాంధ్ర - రుద్రవరం : రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో తాము సాగు చేసిన పంటలు పశువులకు మేతగా వదిలేస్తున్నారు. మండలంలోని చిలకలూరు గ్రామ సమీపంలో రైతులు మిర్చి పంట సాగు చేశారు. పంట దిగుబడులు ఆశాజనకంగా ఉన్నప్పటికీ గిట్టుబాటు ధర లేకపోవడంతో మిర్చి పంటను గొర్రెలకు మేతగా వదిలేశారు. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి సాగుచేసిన పంటలు దిగుబడి వస్తున్నప్పటికీ అలాగే వదిలేస్తున్నారు. ప్రభుత్వ మాత్రము రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తున్నామని చెబుతున్నారు తప్ప ఆచరణలో అమలు కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము సాగు చేసిన పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడంతోనే పశువులకు మేతగా వదిలాల్సిన పరిస్థితిలో నెలకొన్నాయని రైతులు తెలిపారు.

ఆనకట్టకు జలకళ..

విశాలాంధ్ర - శిరివెళ్ల : మండల కేంద్రంలోని ఆనకట్టకుంటకు నిండు కుండలా జలకళ వచ్చేసింది. ప్రస్తుత వేసవిలో నీటి ఎద్దడి సమస్య నుండి సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఆనకట్ట కుంటకు కేసి జలాలను మళ్లించి పూర్తిస్థాయిలో నింపినట్లు ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ శ్రీ లింగేశ్వర రెడ్డి పేర్కొన్నారు. శిరివెళ్ల మేజర్ గ్రామపంచాయతీ ఈవో అశ్విని కుమార్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ వర్కర్లు కేసీ జలాలను ఆనకట్ట కుంటకు నీటిని మళ్లించేందుకు ఎంతో కృషి చేశారని అన్నారు. గతంలో నీటి ఎద్దడికి గురై విలవిలలాడిన శిరివెళ్ల గ్రామ ప్రజలను దృష్టిలో పెట్టుకొని ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా 25వేలకు పైగా జనాభా ఉన్నటువంటి శిరివెళ్లకుపై భాగంలో తలమానికంగా ఉన్న ఆనకట్టకు నీటిని నింపడం వల్ల శిరివెళ్ల వెంకటేశ్వరపురం గ్రామాలలో భూగర్భ జలం పుష్కలంగా అందుతుందన్నారు. బోరు బావులు, చేతి పంపులలో నీరు పుష్కలంగా అంది ప్రజా వినియోగంలోకి వస్తాయని సూచించారు. కేసీ కెనాల్ 16వ లాక్ నుండి సుమారు 4కిలోమీటర్లకు పైగా దూరంలో ఉన్న పంట కాలువ ద్వారా నీటిని మళ్లించి కుంటకు నింపేందుకు గ్రామపంచాయతీ సిబ్బంది కృషి చేసినట్లు ఇఓ అశ్విని కుమార్ పేర్కొన్నారు. సర్పంచ్ లక్కాకుల సాలమ్మ చంద్ర ఏఈ ఇఓ ఇతర అధికారులు సిబ్బంది ఆనకట్ట కుంటలోని నీటిమట్టాన్ని పరిశీలించారు.

ప్రభుత్వ స్థలాలను అన్వేషించండి

జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : జిల్లాలోని అభివృద్ధి సంస్థల ఏర్పాటుకు ప్రభుత్వ స్థలాలను గుర్తించాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా నలుమూలాల నుంచి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదుల స్వీకరణకు ముందు వివిధ అంశాలపై అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డిఆర్ రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ ఎంఎస్ ఎంఈ పార్కులు, కుసుమ్ కార్యక్రమం క్రింద విద్యుత్ సబ్ స్టేషన్లు, రిలయన్స్ సంస్థ వారిచే కంప్రెస్ట్ బయో గ్లాస్ ప్లాంట్లు, స్టార్ హెటళ్లు, ఐటిఐ సంస్థల ఏర్పాటుకు డివిజన్ల పరిధిలో ప్రభుత్వ స్థలాలను అన్వేషించాలని సూచించారు. విద్యుత్ సబ్ స్టేషన్లకు 5నుండి 10ఎకరాలు, ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు 50నుండి 100ఎకరాలను స్థలాలను గుర్తించాలన్నారు. నంద్యాల జిల్లాలో రెండు స్టార్ హెటల్స్ రానున్నాయని, రెవెన్యూ, ఇరిగేషన్, ఆర్అండ్ బీ శాఖలకు చెందిన భూములను గుర్తించాలన్నారు. స్టార్ హెటల్ నిర్మాణానికి 2నుండి 3ఎకరాల భూమిని గుర్తించాలన్నారు. జాతీయ రహదారి శివారు ప్రాంతాలు, లేక్ వ్యూ, హిల్ వ్యూలతో కూడిన భూములను పరిశీలించాలని జాయింట్ కలెక్టర్ను సూచించారు. పట్టణంలో స్టార్ హెటల్ ఏర్పాటు చేసే అంశాన్ని కూడా పరిశీలించాలని నంద్యాల ఆర్డీఓను కలెక్టర్ ఆదేశించారు. రిలయన్స్ సంస్థ ఏర్పాటుచేసే కంప్రెస్ట్ బయో గ్యాస్ ఏర్పాటుకు స్థలాలను పరిశీలించాలన్నారు. ఇందుకోసం రిలయన్స్ కంపెనీ బృందాలు జిల్లాకు వచ్చి స్థల పరిశీలన అంశంపై నంద్యాల ఆర్డీఓను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఐటిఐ కళాశాల ఏర్పాటు కోసం రెండు ఎకరాల భూమిని కేటాయించేలా స్థలాలను అన్వేషించాలన్నారు.

నిరుద్యోగులకిచ్చిన హామీని అమలు చేయాలి

విశాలాంధ్ర - నంద్యాల అర్బన్: ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా కార్యదర్శి జి.నాగరాముడు డిమాండ్ చేశారు. రాష్ట్ర సమితి పిలుపులో బాగంగా సోమవారం నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డిఆర్ఓ రాము నాయక్కి ఏఐవైఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. నాగరాముడు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మొదటి సంతకం చేశారని కానీ ఇంతవరకు నోటిఫికేషన్ వెలుబడలేదని ఆరోపించారు. లక్షలాదిమంది నిరుద్యోగులు కోచింగ్ సెంటర్లో లక్షల్లో ఫీజులు చెల్లించి కోచింగ్ తీసుకుంటున్నారని నోటిఫికేషన్ వెలువడక ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. అనంతపురం, కర్నూలు, కడప, ప్రకాశం, నెల్లూరు, అల్లూరి సీతారామరాజు జిల్లాల పోస్టుల జారీలో అన్యాయం జరిగిందని తగిన పోస్టులు మంజూరు చేయలేదని అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టికి సమస్యలు తీసుకువెళ్లి అభ్యర్థులకు న్యాయం జరిగేలా అన్ని జిల్లాలకు స్థానిక అవసరాల రీత్యా పోస్టుల మంజూరు జరిగేలా చూడాలన్నారు. త్వరితగతిన డీఎస్సీ నోటిఫికేషన్ అన్ని వివరాలతో వెలువడేలా కృషి చేయాలని, లేనిపక్షంలో అఖిల భారత యువజన సమాఖ్య గా ఉద్యమాలు చేపడతామని తెలిపారు. విష్ణు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజల పక్షాన పోరాటం : సీపీఐ

విశాలాంధ్ర - నంద్యాల అర్బన్: ఎల్లవేళలా పేద ప్రజల పక్షాన నిలబడి పోరాడే పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) అని నంద్యాల సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ పేర్కొన్నారు. నంద్యాల పట్టణ శివారులోని నందమూరి నగర్ లో శాఖ కార్యదర్శి హుస్సేన్నా అధ్యక్షతన ఇంటి స్థలాల అర్జీదారుల సమావేశం జరిగింది. సమావేశంలో పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ మాట్లాడుతూ ఇల్లు లేని నిరుపేదల కోసం రాష్ట్రవ్యాప్తంగా సిపిఐ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్ల ఇంటి స్థలాన్ని కేటాయించాలని డిమాండ్ చేశారు. నంద్యాల పట్టణంలో ఇల్లు లేని వారు వేలాదిమంది ఉన్నారని త్వరగా వారిని గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ఇంటి పట్టాలు ఇచ్చి, ఇళ్ళ నిర్మాణానికి ఐదు లక్షల హౌసింగ్ లోన్ ఇవ్వాలన్నారు. అనంతరం నందమూరి నగర్ లో ఇంటి స్థలాల అర్జీదారుల నూతన కమిటీని 15 మందితో ఎన్నుకోవడం జరిగింది. ఈ సమావేశంలో ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి డి శ్రీనివాసులు, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీదేవి, మహిళా సమాఖ్య పట్టణ కన్వీనర్ సుశీలమ్మ, నందమూరి నగర్ ఇంటి స్థలాల అర్జీదారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో..
మౌలిక సదుపాయాలు కల్పించాలి

విశాలాంధ్ర - బనగానపల్లె : బనగానపల్లె పట్టణంలో ప్రభుత్వాస్పత్రిలో కనీస మౌలిక సదుపాయాలు కల్పనపై దృష్టిసారించాలని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ను రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి కోరారు. సోమవారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి బనగానపల్లె నియోజకవర్గంలో ప్రభుత్వాస్పత్రులకు నిధులు కేటాయించాలని ఆరోగ్య శాఖ మంత్రి దృష్టికి తీసుకురావడం జరిగింది. ముఖ్యంగా బనగానపల్లె ప్రభుత్వాస్పత్రిలో మౌలిక సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటికే ఈ అంశాన్ని ఆరోగ్య శాఖ సెక్రటరీ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. స్థానిక అవుకు ప్రభుత్వాస్పత్రిలో తన సొంత నిధులు రూ.25 లక్షలు వెచ్చించి వైద్య పరికరాలు అందజేసినట్లు తెలిపారు. స్థానిక శాసనసభ్యుడిగా తాను ఆస్పత్రిలో మౌలిక సదుపాయాల కల్పనకు సొంత నిధుల ద్వారా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నానని, అయితే వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కూడా ప్రభుత్వం తరపున త్వరితగతిన నిధులు కేటాయించి, ప్రజలకు మెరుగైన వైద్యసేవలు కల్పించాలని కోరారు.

ఓర్వకల్లు విమానాశ్రయానికి
ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పేరు పెట్టండి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల జిల్లా ఓర్వకల్లు విమానాశ్రయానికి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పేరు పెట్టాలని భారత పౌర విమానాయ శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడుకు నంద్యాల ఎంపీ, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి వినతి పత్రం అందించారు. సోమవారం ఢిల్లీలోని కేంద్ర పౌర విమానాయశాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడును ఆయన కార్యాలయంలో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం నంద్యాల జిల్లా ఓర్వకల్లు విమానాశ్రయానికి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పేరు పెడతామని తెలిపి ఆయన పేరు పెట్టకుండా రాయలసీమ ప్రజలను విస్మరించారని ఆరోపించారు. బ్రిటిష్ వారిపై తొలి తిరుగుబాటునేత, తొలి స్వాతంత్ర్య సమరయోధుడు, రాయలసీమ ముద్దుబిడ్డ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పేరు ఓర్వకల్లు విమానాశ్రాయానికి పెట్టాలని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడును కోరారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సానుకూలంగా స్పందించడం పట్ల ఆమె ధన్యవాదములు తెలిపారు.

కాపలా కాసేందుకెల్లి కన్నుమూత

విశాలాంధ్ర - కొత్తపల్లి : తాను సాగుచేసుకొన్న పొలం వద్దనే ఓ రైతు మృత్యువాత పడిన ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెలితే కొత్తపల్లి గ్రామానికి చెందిన చాకలి మధు (38) 6ఎకరాలను కౌలుకు తీసుకొని 3ఎకరాల్లో వేరుశనగ, 3ఎకరాల్లో మినుము పంటను గ్రామ పొలిమేరలో నల్లమల అటవీ ప్రాంతానికి చేరువలో సాగుచేసుకున్నాడు. అయితే అటవీ ప్రాంతం సమీపంలో ఉండడంతో వేరుశనగ పంటకు అడవి పందుల బెడద ఎక్కువైంది. దీంతో మధు భార్యకు చెప్పి ఆదివారం రాత్రి పంటకు కావలి చేసుకొనేందుకు వెళ్లాడు. సోమవారం ఉదయం మధు స్నేహితుడు పాతకోట వెంకటరమణ తను వేసుకొన్న పొలానికి నీళ్లు పెట్టుకొనేందుకు డీజిల్ తీసుకొని మధు వద్దకు వెల్లాడు. మచ్చపై నిద్రపోతున్న మధును వెంకటరమణ వెల్లి నిద్ర లేపగా లేవలేదు. అప్పటికే మధు కదలని స్థితిలో చనిపోయిన స్థితిలో ఉండడం గమనించి, విషయాన్ని వెంకటరమణ వెంటనే మధు భార్య అనితకు ఫోన్ చేసి తెలిపాడు. అక్కడికి వెల్లిన కుటుంబ సభ్యులు బోరున విలపించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ ఎం. కేశవ సిబ్బందితో కలసి సంఘటన స్థలికి వెల్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్థం నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి భార్య అనిత ఇచ్చిన పిర్యాదు మేరు కేసు నమోదు చేసుకొన్నామని ఎస్ఐ తెలిపారు. కాగా మధు ఏదైనా విషపురుగు గాని, పాముగాని, గుండెపోటుతో చనిపోయాడ, ఇతర కారణాల చేత వలన చనిపోయినాడ అని భార్య పిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

పక్కా గృహాలు మంజూరు చేయాలి

విశాలాంధ్ర - శిరివెళ్ల : సమాజంలో అవయవ లోపంతో జీవనం సాగిస్తున్న దివ్యాంగులకు నివాస స్థలాలు, పక్క గృహాలు ప్రభుత్వం మంజూరు చేయాలని వికలాంగుల ఆదరణ సేవా సమితి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు జజ్జూరి మరియదాస్ పేర్కొన్నారు. మండల పరిధిలోని చెన్నూరు గ్రామంలో వికలాంగుల ఆదరణ సేవా సమితి ఆధ్వర్యంలో 5 మంది దివ్యాంగులకు మూడు చక్రాల సైకిళ్లను మరియ దాస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన దివ్యాంగులకు మూడు చక్రాల మోటారు సైకిళ్ళు ట్రై సైకిల్లు, బ్యాటరీ వాహనాలను ప్రభుత్వం పంపిణీ చేసి ఆదుకోవాలని అన్నారు. ఎన్నో సంవత్సరాల నుండి ప్రభుత్వాల ఆదరణకు నోచుకోక దివ్యాంగులు దగా పడుతున్నారని ఈ సందర్భంగా ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు

విశాలాంధ్ర-చాగలమర్రి : పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభం అయ్యాయి.సోమవారం తొలి రోజు పరీక్ష కావడంతో విద్యార్థులతో పాటు వెంట తల్లి తండ్రులు పిల్లల్ని తీసుకొని పరీక్ష కేంద్రాలకు వచ్చారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర,బాలికల ఉన్నత పాఠశాలలు,సెయింట ఆన్స్ పాఠశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసారు. తొలిరోజు కావడంతో పరీక్ష కేంద్రాలకు ఉదయం 8.30 గంటలకే విద్యార్దులు కేంద్రాలకు చేరుకున్నారు. 9గంటలకు విద్యార్దులను క్షుణ్ణంగా తనిఖీ చేసి పరీక్ష కేంద్రంలోకి పంపించారు. ఎటువంటి ఎలాక్ట్రానికి పరికరాలు లోపలికి అనుమతించలేదు. మొత్తం 760 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 742మంది మొదటి రోజు హాజరయ్యారని అబ్జర్వరులు ఎంఈఓలు అనురాధ,న్యాంతుల్లాలు తెలిపారు.ఆళ్ళగడ్డ డిఎస్పి ప్రమోద్,రూరల్ సిఐ మురళిధర్ రెడ్డిల ఆదేశాల మేరకు ఎస్ఐ హరిప్రసాద్ పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 144అమలు చేస్తూ బందోబస్తు పర్యవేక్షించారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

ఆర్ ఓ సి నెం 32/2025/ఎ1
ఆత్మకూరు పురపాలకసంఘము,
తేది 18-03-2025.

బహిరంగ వేలము ప్రకటన

ఇందుములముగా యావన్మంది పట్టణ ప్రజలకు తెలియజేయునది ఏమనగా 2025-26 ఆర్థిక, సంవత్సరమునకు సంబంధించి ఆత్మకూరు పురపాలకసంఘము అధీనం నందు గల డైలీ కూరగాయల మార్కెట్ గేట్స్ తేది 20-03-2025న ఉదయం 10.30 గంటలకు పురపాలకసంఘ కార్యాలయం నందు బహిరంగ వేలం పాటలు నిర్వహించబడునని తెలియజేయడమైనది.

వేలము నిర్వహించు వివరములు :

వ నెం	వద్దు వివరములు	లీజు కాలము
1	వారపు సంత మార్కెట్	01-04-2025 నుండి 31-03-2026 అర్ధ రాత్రి వరకు
2	దిన కూరగాయల మార్కెట్	
3	బస్టాండ్ ఫీజులు	
4	చిన్న కమేల	
5	పెద్ద కమేల	
6	చేపలు, చికెన్ అమ్మకం	

కావున వేలము నందు పాల్గొనదలచిన వారు వేలమునకు సంబంధించి 2025-2026 సం॥ము గెజిట్ లోని షరతులు నియమనిబందనలు తప్పక పాటించవలయును మరియు ఇతర వివరములకు ఈ కార్యాలయము పని వేళల యందు రెవెన్యూ సెక్షన్ నందు ఎ1 గుమాస్తాను సంప్రదించగలరు.

కమిషనరు
ఆత్మకూరు పురపాలకసంఘము.

ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర - కోవెలకుంట్ల : మండలంలో నిర్వహించే ఆధార్ క్యాంపులను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో అన్నారు. ఈ సందర్భంగా సోమవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 19న కోవెలకుంట్ల 2, భీమునిపాడు, 20వ తారీఖున కోవెలకుంట్ల 3, రేవనూరు, 21వ తారీఖున కోవెలకుంట్ల 4.5, బిజినవేముల, సౌదర దీన్నే, 22వ తారీఖున గుళ్లదుర్తి, చిన్న కోపెర్లల సచివాలయంలో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వరప్రసాద్ రావు తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలందరూ వినియోగించుకోగలరని ఆయన అన్నారు.

కౌలు రైతుల సంక్షేమానికి
సమగ్రమైన చట్టాన్ని చేయాలి

కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కాటమయ్య

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : కౌలు రైతుల రక్షణ - సంక్షేమం కోసం సమగ్రమైన చట్టాన్ని తేవాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కాటమయ్య డిమాండ్ చేశారు. సోమవారం నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ జి.రాజకుమారికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి డి.సోమన్న, నరసింహులు, జిల్లా రైతు సంఘం సహాయ కార్యదర్శి కే భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు కాటమయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు 80% శాతం మంది భూములను కౌలుకు తీసుకొని సాగు చేసుకుంటూ బ్రతుకుతున్నారని, వారికి ప్రభుత్వ సహాయ సహకారాలు ఏమాత్రం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నంద్యాల జిల్లాలో దాదాపు గ్రామాలలో 60 శాతం మంది కౌలు రైతులున్నారని, వారికి గుర్తింపు కార్డులు లేక బ్యాంకు రుణాలు అందక ఇబ్బంది పడుతున్నారని, ప్రతి సంవత్సరం రెవెన్యూ రికార్డులలో అర కొర మందికి కౌలు రైతుల గుర్తింపు కార్డులు ఇచ్చినా బ్యాంకు రుణాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ పంట సాగుదారుల హక్కు చట్టం 2019 జీవోను షరతులు లేకుండా అమలయ్యేలా చూడాలని, భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు కుటుంబాలకు రూ.15లక్షల ఎక్స్గ్రేషియా ఇవ్వాలని, ఖరీఫ్ సీజన్ లో గ్రామసభలు ఏర్పాటు చేసి కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇచ్చి, బ్యాంకులలో పంట రుణాలు ఇవ్వాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోవెలకుంట్ల రైతు సంఘం మండల కన్వీనర్ అబ్రహం, రైతు సంఘం నాయకులు భాష, గోపాలకృష్ణ, ఇబ్రహీం ఎస్ రసూల్, రఫీ నబి సాహెబ్ ఈశ్వరమ్మ రజాక్ జమాలయ్య తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, మంగళవారం 18, మార్చి 2025

వర్గపోరుకు బలైపోతున్న అధికారులు

- అధికారులపై రోజురోజుకు పెరుగుతున్న రాజకీయ ఒత్తిళ్లు..
- మా మాట వినకపోతే అంతేసంగతులంటూ బెదిరింపులు
- బదిలీ చేయిస్తామంటూ రాయకుల పెత్తనం చెలాయింపు

విశాలాంధ్ర - దేవనకొండ: మండలంలో ఆయాశాఖలలో పనిచేసే అధికారులకు రాజకీయ ఒత్తిళ్లు రోజురోజుకూ పెరిగి పోతున్నాయి. అధికారులు తమ విధులను సక్రమంగా విని యోగించుకోలేకపోగా, సమాన్యులకు సైతం న్యాయం చేయ లేక పోతున్నారు. ఏ నాయకుడి నుండి ఎలాంటి తల నొప్పి వస్తుందోనంటూ తలలు పట్టుకుంటున్నారు. అధికార పార్టీకి చెందిన నేతల మధ్య వర్గ విభేదాల మధ్య వారు బలై పోతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. మండలంలో ఒకే పార్టీలోని రెండు వర్గాల పోరుతో సతమతమవుతున్నారు. అధికారులకు తమ విధుల్లో అంతరాయం కలుగుతుండటం, పాలనలో స్పష్టత లేకపోవడంతో మండల ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికార పార్టీకి చెందిన నేతల మధ్య వర్గ విభేదాలు కొత్త మలుపులు తిరుగుతున్నాయి. పార్టీకి చెందిన రెండు వర్గాలు తమ ఆధిపత్యాన్ని ప్రదర్శిం చేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. అధికారులను తమ వైపుకు తిప్పుకునేందుకు ఓ వర్గం ఒత్తిడి తీసుకురాగా, మరో వర్గం అదికూడదని అడ్డుపడుతోందని ప్రజలు గుసగుస లాడుతున్నారు. ఈ క్రమంలో అధికారులు ఎవరికి అనుకూ లంగా పని చేయాలో అర్థంకాక వారి తలలు బద్దలైపో తున్నాయి. కొందరు రాజకీయ నేతలు తమ ఆదేశాలను పాటించాలంటూ అధికారులకు ఒత్తిడి తెస్తున్నారు. వారిని అనుసరించకుంటే బదిలీ చేయిస్తామని బెదిరిస్తున్నట్లు సమాచారం. దీంతో అధికారులు భయభ్రాంతులకు గురై, నిస్సాహాయ స్థితిలో ఉన్నారు. విధులను నిర్విఘ్నంగా నిర్వహించాల్సిన వారు ఇప్పుడు రాజకీయ ఒత్తిళ్ల మధ్య చిక్కు కుపోయారు. ఈ వర్గ విభేదాలు ప్రజాసేవలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. అధికారులు సమర్థవంగా పనిచేయక పోవడంతో ప్రజలకు అందాల్సిన సేవలు మంద కొడిగా మారాయి. అభివృద్ధి కార్యక్రమాలు కూడా రాజకీయ ఒత్తిళ్ల కారణంగా స్తంభించి పోతున్నాయి. అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వహించేందుకు అడ్డంకులు ఏర్ప డుతున్నాయని, ఉన్నతస్థాయి అధికారులు దీనిపై తక్షణమే చర్యలు తీసుకో వాలని లోపాయ కారీగా అభిప్రాయ

పడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు పరిస్థితిని సమీక్షించి, రాజకీయ ఒత్తిళ్ల నుంచి అధికారులను విముక్తి చేస్తారా? లేక అధికార వ్యవస్థపై రాజకీయ నాయకుల ప్రభావం కొనసాగుతూనే ఉంటుందా? అనే ప్రశ్నలు ఇప్పుడు దేవనకొండ మండలంలో హాట్ టాపిక్‌గా మారాయి.

అహంకారపు బ్యాంకు మేనేజర్‌ను సస్పెండ్ చేయాలి

విశాలాంధ్ర - పెద్దకడబూరు : అహంకారపు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్‌ను అసిస్టెంట్ మేనేజర్ వేణును సస్పెండ్ చేయాలంటూ సోమవారం మండల కేంద్రం లోని స్థానిక ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిం చారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్య వర్గ సభ్యులు భాస్కర్ యాదవ్, మండల కార్యదర్శి వీరేష్, పార్టీ సభ్యులు రాజు మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా అర్హులైన నిరుద్యోగ యువతీ యువకులకు సబ్సిడీ యూనిట్స్‌ను కేటాయిం చిందన్నారు. పెద్దకడబూరు మండలానికి 50 యూనిట్లు కేటాయించి, రూ.91.5 లక్షలు మంజూరు అయినట్లు తెలిపారు. దీంతో అర్హులైన నిరుద్యోగులు ధరఖాస్తు చేసుకు న్నారన్నారు. ఇక్కడికి అధికారులు అర్హులైన వారికి కాకుండా రాజకీయ నాయకులు సూచించిన వారికే యూనిట్లు ఇవ్వడానికి ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు స్పందించి ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులైన నిరుద్యోగులకు యూనిట్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఖాతాదారుల సమస్యలపై ధర్నా అనంతరం సీపీఐ పార్టీ బ్యాంకు మేనేజర్‌కు వినతిపత్రం ఇవ్వాలని చూస్తే గంటవరకు బయటకు రాకుండా అహంకార పూరితంగా వ్యవహరించడం శోచనీయమ న్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని బ్యాంకు మేనేజర్ నిరంజన్ రెడ్డికి అందజేశారు. నాయకులు తిక్కన్న, రెక్కల గిడ్డయ్య, మారెప్ప, ఆంజనేయ, లక్ష్మన్న, నాగేష్, రాము, బాబు తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక భక్తుల పాదయాత్ర

విశాలాంధ్ర - హొళగుంద: కర్ణాటక భక్తులు సోమవారం శ్రీశైల భ్రమరాంబ, మల్లికార్జున స్వామి దర్శనం కోసం పాదయాత్ర చేశారు. బళ్లారి జిల్లాలోని బాదన హట్టి, కురుగోడు, సిరి గిరి, కరువు, కూరిగ నూరు, మాట సూగూరు తదితర ప్రాంతాల నుండి వందలాదిమంది భక్తులు భజనలు చేస్తూ శివపార్వతీ, శ్రీశైలం మల్లికార్జున స్వామి పల్లకిలను పురవీధుల గూండా ఉపయోగిస్తూ పాదయాత్ర చేపట్టారు. భక్తులకు మార్గమడకి, హొళగుంద వీర శైవ సంఘం, శ్రీశైల మల్లి కార్జున స్వామి సేవా సమితి ఆధ్వర్యంలో అన్న దాన కార్యక్రమాన్ని చేశారు. హొలగుంద సుంకులమ్మ దేవి ఆలయం, చిన్న హేట, బిజీ హళ్లి, పెద్ద ఆట, ఎల్లార్తి, నేరణికిలో కర్ణాటక భక్తులకు అల్పాహార సేవ కార్యక్రమంతో పాటు అన్న దానం కార్యక్రమాన్ని నిర్వ హించారు. భక్తులకు పండ్లు, మజ్జిగ, కూల్ డ్రింక్స్‌ల పంపిణీ చేశారు. మెడికల్ షాప్ యజమాని సిద్ద మల్ల కర్ణాటక భక్తులకు వైద్య చికిత్స చేసి ఉచి తంగా మందులను అందించారు. స్వామి దర్శనం కోసం ప్రతి ఏటా యాత్ర చేస్తున్నామని వారంలో శ్రీ శైలానికి చేరుకుంటామని కరూర్ గ్రామానికి భక్తుడు రామన్న తెలిపారు. కర్ణాటక భక్తులు సిద్ధేశ్వర స్వామి, మారెమ్మా దేవి, సాయిబాబా ఆలయాలను దర్శించుకున్నారు. చినిగి సాబ్, సైబన్న దర్గాలలో భక్తులు పూజలు చేసి తీర్థ ప్రసాదాలను పొందారు. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి.

వైన్‌షాప్ లైసన్స్ రద్దు చేయాలి : సీపీఐ

విశాలాంధ్ర - కర్నూలు : పొలాల మధ్యలో ఏర్పాటు చేసిన వైన్ షాప్ లైసెన్సు రద్దు చేయాలని సీపీఐ నాయ కులు డిమాండ్ చేశారు. సోమ వారం సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు జగన్నాథం. నాయకులు శ్రీనివాస రావుల ఆధ్వర్యంలో ప్రొహిబీషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కల్లూరు మండలంలో పెద్దటేకురు గ్రామ సమీపంలో హైవే రోడ్డులో సుమారు మూడు ఎకరాల స్థలంలోరేణుక ఎల్లమ్మ వైన్స్ వారు మద్యం విచ్చలవిడిగా ఎలాంటి సమయపాలన పాటించకుండా మద్యాన్ని విక్రయిస్తున్నారని ఆరోపించారు. సమయపాలన లేకుండా షాప్‌ను నడుపుతున్నారని, వైన్‌షాప్‌ను బార్‌అండ్ రెస్టారెంట్‌గా మార్చారని ఆరోపించారు. జాతీయ రహదారి పక్కనే ఉండటంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వెంటనే దానిపై చర్యలుతీసుకోవాలని,లైసెన్స్ రద్దుచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెద్ద టేకూరు పుల్లన్న, దొడ్డిపాడు మహమ్మద్ భాష పాల్గొన్నారు.

డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి : ఏఐవైఎఫ్

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మొదటి సంతకం డీఎస్సీ కోసం చేసి డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వడం మరచి పోయారని, వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయా లని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి పిలుపుమేరకు కర్నూలు జిల్లా సమితి ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమానికి ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీరాములు అధ్యక్షత వహించక ఈ ధర్నాను ఉద్దేశించి కె. శ్రీని వాసులు మాట్లాడుతూ 2024 ఎన్నికలకు ముందు వైసిపి ప్రభుత్వం డీఎస్సీ అభ్య ర్థులను పూర్తిగా మోసం చేసిందన్నారు. మొదటి సంతకం డీఎస్సీ నోటిఫికేషన్ పైన చేస్తానని హామీ ఇవ్వడమే కాకుండా ప్రతి సంవత్సరం డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తామని అధికారం చేపట్టే తొమ్మిది నెలలు గడుస్తున్నా సంతకాలకే పరిమితమయ్యా రన్నారు. రాష్ట్ర ప్రభుత్వమే మూడు వేల రూపాయలు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చిందని అయితే బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న నిరుద్యోగ భృతికి నిధులు కేటాయించకపోవడం అనేక అనుమానాలకు తావిస్తుందని ఆయన మండి పడ్డారు. ఈ ధర్నాకి ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి సంపూర్ణ మద్దతు తెలియజేస్తూ జిల్లా అధ్యక్షులు సోమన్న, జిల్లా సహాయ కార్యదర్శి శరత్ కుమార్, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి శ్రావణి, నగర అధ్యక్ష కార్యదర్శులు నాగేంద్రమ్మ, భారతి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు హనుమేష్, జిల్లా సహాయ కార్యదర్శులు బిసన్న, రాజీవ్, రాజు, జిల్లా సమితి సభ్యులు రాజు, జాఫర్, వినోద్, నగర అధ్యక్షులు నాగరాజు నగర నాయకులు కృష్ణ, శ్రీకాంత్, చంటి, మధు, శీను,శివ, రవికుమార్, ప్రభాకర్, నబి, హసన్ పాల్గొన్నారు.

పట్టణంలో చేనేత కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

విశాలాంధ్ర - కోడుమూరు : రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమం కోసం బడ్జెట్లో కేటాయించిన అరకొర నిధుల పట్ల నిరసన వ్యక్తం చేస్తూ పట్టణంలోని కోట్ల విజయభాస్కరరెడ్డి సర్కిల్ వద్ద రాష్ట్ర చేనేత కార్మిక సంఘం అధ్యక్షులు బుగుడే మాధవ స్వామి ఆధ్వర్యంలో చేనేత కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. సోమవారం చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీరాములు అధ్యక్షతన చేనేత కార్మికులు కోట్ల సర్కిల్ వద్ద రోడ్డుపై బైఠా యించి అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. నిరసన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు బుగిడే మాధవస్వామి హాజరై, మాట్లాడుతూ బడ్జెట్లో కేటాయించిన నిధులతో చేనేత కార్మికుల పట్ల కూటమి ప్రభుత్వానికి ఎంత ప్రేమ ఉందో అర్థమవుతుందన్నారు. కనీసం చేనేత కార్మికులకు రాష్ట్ర బడ్జెట్లో రూ.2 వేల కోట్లు కేటాయించాలని అడిగితే, కేవలం రూ.115కోట్లు కేటాయించి, చేనేత కార్మికుల పట్ల పూర్తి కూటమి నేతలు నిర్లక్ష్యం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంకుల ద్వారా చేనేత కార్మికులకు రూ.5 లక్షల లోన్లు సబ్సిడీలతో ఇవ్వాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం పాలన 9 నెలలు గడుస్తున్నా, ఏ విధమైన సంక్షేమ పథకాలు ప్రభుత్వము అందిం చడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎం.లోకనాథ్, ఎ.రాజు, విజయ్, బోయ విజయ్, మధు, డి.వలి, ఎస్.రాము, జగన్నాథ్ పాల్గొన్నారు.

కౌలు రైతుల సంక్షేమం కోసం సమగ్ర చట్టాన్ని తేవాలి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : రాష్ట్రవ్యాప్తంగా కౌలు రైతుల రక్షణ సంక్షేమం కోసం సమగ్రమైన చట్టాలు ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగ న్నాథం డిమాండ్ చేశారు. సోమవారం కర్నూలు కలెక్టర్ కార్యాలయం ముందు ఏపీ కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్య క్రమానికి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి తిమ్మయ్య అధ్యక్షత వహిం చారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగ న్నాథం, జిల్లా కార్యదర్శి పంపన్న గౌడ్ పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు 80 శాతం మంది భూములను కౌలుకు తీసుకొని సాగు చేసుకుంటూ బ్రతుకుచున్నారన్నారు. ప్రభుత్వ సహాయ సహకారాలు ఏమాత్రం అందడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో దాదాపు గ్రామాలలో 60 శాతం మంది కౌలు రైతులు ఉన్నారని వారికి గుర్తింపు కార్డులు లేక బ్యాంకు రుణాలు అందక ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఖరీఫ్ సీజన్‌లో గ్రామాలలో గ్రామసభలు ఏర్పాటు చేసికౌలు రైతులం దరికీ గుర్తింపు కార్డులు బ్యాంకుల్లో పంట రుణాలు ఇవ్వాలని వారు తెలి పారు. ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి డి.శ్రీనివాసరావు, సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణా రెడ్డి, నగర సహాయ కార్యదర్శి సి.మహేష్, రైతు సంఘం నగర నాయకులు పుల్లన్న, రామాంజ నేయులుపాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కి వినతిపత్రం సమర్పించారు.

పది పరీక్షల్లో 634 మంది గైర్హాజరయ్యారు

- జొన్నగిరి తెలుగు ఉపాధ్యాయులు సస్పెండ్

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రారంభమైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.సామెల్ పాల్ సోమవారం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 172 కేంద్రాల్లో పరీక్షలు ప్రారంభమయ్యాయని, తెలుగుతోపాటు ఉర్దూ, కన్నడ, అరబిక్ పరీక్షలు సైతం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెగ్యులర్ విద్యార్థులు 31,461 మంది అనీ, 30827 పరీక్షకు హాజరుకాగా, 634 గైర్హాజరైనట్లు విలేకరులకు తెలిపారు. జొన్నగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ తెలుగు ఉపాధ్యాయుడు కేసన్నను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారిచేసినట్లు తెలిపారు. నిబంధనలకు అనుగుణంగా ఆయా సబ్జెక్టు టీచర్ పరీక్ష కేంద్రాల్లో ఉండటానికి అవకాశం లేదని, అందుకు విరుద్ధంగా అతను అక్కడే ఉండటానికి తీవ్రంగా ప్రయత్నించిన నేపథ్యంలో సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు వెల్లడించారు.

మొదటి రోజే నలుగురు విద్యార్థులు గైర్హాజరు

విశాలాంధ్ర- క్రిష్ణగిరి: ప్రారంభమైన పదవ తరగతి పరీక్షల్లో మొదటి రోజే నలుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ2 మద్దిలేటి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ మూడు పరీక్ష కేంద్రాల్లో కలిపి 571 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. ఇందులో సోమవారం నిర్వహించిన పరీక్షలో నలుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు.

పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రతా

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : పదవ తరగతి పరీక్షా కేంద్రాల వద్ద ఆయా పోలీసులు పటిష్ట బందోబస్తు చేపట్టారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంది. ప్రత్యేక పోలీసు బృందాలచే పరీక్షా కేంద్రాల వద్ద పెట్రోలింగ్ చేపట్టడం, పరీక్షలలో పాల్గొనే విద్యార్థులు, పరీక్షల నిర్వహణ ఆయా స్కూళ్ల సిబ్బంది మినహా ఎవర్నీ ఆ పరిసర ప్రాంతాల్లోకి రాకుండా చర్యలు చేపట్టారు. పరీక్షా కేంద్రాల్లోకి వెళ్లే విద్యార్థులు ఎలాంటి సెల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్ లు, మరియు ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష కేంద్రాల్లోకి తీసుకెళ్ల కుండా క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. పరీక్షలు సజావుగా, సాఫీగా జరగడానికి జిల్లా ప్రభుత్వ యంత్రాంగంతో కలిసి జిల్లా పోలీసు శాఖ తరపున అన్ని కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు.

మధ్యవర్తిత్వంపై న్యాయవాదులకు శిక్షణ

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు సోమవారం కర్నూలు, నంద్యాల జిల్లాల న్యాయవాదులకు, ఎన్జీవోలకు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యా లయ భవనంలో శిక్షణా కార్యక్రమాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాది కార సంస్థ అధ్యక్షులు జి. కబర్ది జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ సుప్రీం కోర్ట్ ఆదేశాల ప్రకారం హైకోర్ట్ అన్నీ జిల్లా కోర్టుల్లో మధ్యవర్తిత్వం ప్రవేశ పెట్టాలని తీర్మానించింది అన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 17 నుంచి 21 వరకు మధ్యవర్తిత్వంలను ఏ విధంగా చేయాలి అని న్యాయవాదులకుచ ఎన్జీవోలకు అవగాహన కల్పించనున్నారు. కేరళ నుండి మధ్యవర్తిత్వం శిక్షణ సిబ్బంది సురేష్ పీజీ, జ్యోతి గోపి నాధన్ వచ్చారని తెలిపారు.

వేగవంతంగా పరిష్కరించండి

విశాలాంధ్ర - ఆదోని : పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం - పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తిపరిచేలా చూడాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. సోమవారం సబ్ కలెక్టర్ పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం - పీజీఆర్ ఎస్‌లో సబ్ కలెక్టర్ పాల్గొని, డివిజన్లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల నుండి వచ్చిన అర్జీలను స్వీకరించారు. మండలంలోని ఆయా శాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇన్స్పెక్టర్ సర్వాయర్స్ శ్రీనివాసరాజు, వేణు సూర్య, డీఎల్పీవో నూర్జహాన్, డీఎల్‌డీవో రమణారెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఈఈ పద్మజ, ఆర్ అండ్ బీ డిప్యూటీ ఇంజనీర్ వెంకటే శ్వర్లు, ఆర్టీసీ డిపో మేనేజర్ మహ్మద్ రఫీ, డిప్యూటీ డిఎంహెచ్వో సత్యవతి, ఉప తహశీల్దారు గుండాల నాయక్ పాల్గొన్నారు.

ప్రాధాన్యత క్రమంలో వసతుల కల్పనలి

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : నగరంలో వివిధ కాలనీల్లో మౌలిక వసతులను ప్రాధాన్యత క్రమంలో కల్పిస్తామని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు అన్నారు. సోమవారం నగరపాలక కార్యాల యంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 12 అర్జీలు రాగా, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అర్జీదారులకు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ మేనేజర్ ఎన్.చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ కె.విశ్వేశ్వర్ రెడ్డి, ఎస్ఈ రాజశేఖర్, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఎంఈ సత్యనారాయణ, పారిశుద్ధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, సూపరింటెండెంట్లు క్రిస్టోఫర్, వాజిద్, టిడ్కో అధికారి పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇంచార్జీ వైస్‌ఛాన్స్‌లర్‌గా బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: రాయలసీమ యూనివర్సిటీ వైస్ ఛాన్సులర్ ఆచార్య వి.వెంకట బసవరావు నగరంలోని క్లస్టర్ యూనివర్సిటీ ఇన్చార్జ్ వైఛ్ఛాన్సులర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. క్లస్టర్ వర్సిటీ అధ్యాపకులు బోధన సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి వారికి అభినందనలు తెలియజేశారు. ఇంచార్జీ వీసీగా ఆచార్య బసవరావును నియమిస్తూ రాష్ట్రప్రభుత్వం జీవో ఆర్టీ నెంబర్ 46ను విడుదల చేసింది. ఇప్పటివరకు క్లస్టర్ యూనివర్సిటీ వీసీగా బాధ్యతలు నిర్వహించిన ఆచార్య డీవీఆర్ సాయి గోపాల్ పదవీ కాలం ముగియడంతో ఈ నియామకం చేపట్టినట్లు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి కోనశశిధర్ ఉత్తర్వుల్లో అన్నారు. ఇంచార్జీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆచార్య వి.వెంకట బసవ రావుకు క్లస్టర్ యూనివర్సిటి రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు, రాయలసీమ యూనివర్సిటి రిజిస్ట్రార్ డాక్టర్ బోయ విజయ్ కుమార్ నాయుడుతో పాటు సిల్వర్ జుబ్లీ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీఎస్ కుమార్, ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఇందిరా, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

రేపు రవీంద్ర మహిళా డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: ఈ నెల 19వ తేదీన బుధవారం ఉదయం 9 గంటలకు స్థానిక అబ్బాస్ నగర్‌లోని రవీంద్ర మహిళా డిగ్రీ కళాశాలనందు జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని, నిరుద్యోగ యువతీ, యువకులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కళాశాల డైరెక్టర్ జి.పుల్లయ్య కోరారు. ఈ జాబ్ మేళా లో 4 కంపెనీలు పాల్గొననున్నాయని, నిరుద్యోగ యువతి యువ కులకు ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. జాబ్ మేళాలో ఎల్అండ్‌టీ, హెట్రో ల్యాబ్స్, డైకిన్ ఎయిర్ కండిషనింగ్, రే డైరెక్ట్ సర్వీసెస్ కంపెనీలు పాల్గొననున్నట్లు తెలిపారు. జాబ్ మేళాలో హాజరు అయ్యే నిరుద్యోగ యువతీ, యువ కులకు విద్యార్హత ధృవీకరణ పత్రాలు తీసుక రావాలని ఆయన సూచించారు.

మెడికవర్ హాస్పిటల్‌ను సీజ్ చేయాలి : సీపీఐ

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : మెడికవర్ హాస్పిటల్‌ను సీజ్ చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమ వారం సీపీఐ కర్నూలు నగర సమితి ఆధ్వర్యంలో ఈరోజు కలెక్టర్ ఆఫీస్ లోని స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌ని కలిసి వినతిపత్రం అందచేశారు.ఈ సందర్భంగా కలెక్టర్‌తో మాట్లాడుతూ మెడికవర్ హాస్పిటల్ ను సీజ్ చేయాలని, హాస్పిటల్ యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయా లని కోరారు.వినతిపత్రం అందచేసిన వారిలో జిల్లా సీని యర్ నాయకులు కె.జగన్నాథం, నగర కార్యదర్శి పి రామ కృష్ణారెడ్డి, నగర సహాయ కార్యదర్శి డి.శ్రీనివాసరావు, నగర కార్యవర్గ సభ్యులు నాగరాజు, అన్వర్, మహేష్ తదితరులు కలెక్టరును కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెడికవర్ హాస్పిటల్ మేనేజ్మెంట్ ఫీజుల దోపిడీలను అరికట్టాలని, డబ్బులు వసూలు చేయ డమే పనిగా పెట్టుకుని మనుషుల ప్రాణాలను గాలిలో కలి పేస్తున్నారని ఆరోపించారు.పేద రోగులు దగ్గర నుండి లక్షల రూపాయలు డబ్బులు కట్టించుకొని శవాలను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్నారని ఆరోపించారు. హాస్పిటల్ డాక్టర్ల పైన యాజమాన్యమైన మహేశ్వర్ రెడ్డి పైన ఎందుకు చర్యలు తీసుకోవాలని, తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఇప్పటిదాకా ఆరోగ్యశ్రీకి సంబంధించిన కేసుల పైన సమగ్రమైన విచారణ చేయించాల న్నారు. గత మూడు రోజుల క్రితం జిల్లామెడికల్ ఆరోగ్య శాఖ అధికారి ఆఫీస్ దగ్గర ధర్నా చేసి వినతిపత్రం ఇచ్చిన ఇప్పటిదాకా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం చాలా బాధాకరమన్నారు. హాస్పి టల్లో మెడికల్ స్టోర్లో అమ్మే మందులన్నీ కూడా నాసిరక నకిలీ మందులని వాటిని తక్షణమే స్వాధీనం చేసుకుని ల్యాబ్ కు పంపించి చెక్ చేయించాలని ,మెడికవర్ హాస్పిటల్ పైన చర్యలు తీసుకునే వరకు యాజమాన్యం పైన కేసులు పెట్టేవరకు సీపీఐ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తానే ఉంటామని వారన్నారు .కలెక్టర్ స్పందిస్తూ తక్షణమే త్రీ మాన్ కమిటీ వేసి విచారణ చేయిస్తామని ,హామీ ఇచ్చారు. త్రీ మ్యాన్ కమిటీ వేసి విచారణ చేయించాలని డిఎంఅండ్‌హెచ్‌ఓను ఆదేశించారు.

పేద ముస్లీం కుటుంబాలకు ఇంటిస్థలం ఇవ్వాలి

విశాలాంధ్ర - కర్నూలు : నగరంలోని మున్సిపల్ కార్పొ రేషన్ 20వ వార్డు నందు జహరాపురం గ్రామ రెవెన్యూ పరిధిలో ఉన్న వక్ఫ్ బోర్డు భూమిని తక్షణమే పేద ముస్లింలకు రెండు సెంట్ల భూమిని కేటాయించాలని సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ముందు సీపీఐ, ఇన్సాఫ్‌ల ఆధ్వర్యంలో ఇన్సాఫ్ నాయకులు అన్వర్ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి రామకృష్ణారెడ్డి, అన్వర్‌లు మాట్లాడుతూ జోహారాపురం గ్రామ రెవెన్యూ పరిధిలో ఉన్న 154 సర్వే నెంబర్లు లో వక్ఫ్ బోర్డ్ భూమి 12 ఎకరాల 49 సెంట్లు భూమి ఉన్నది ఈ భూమిని ఇప్పటికే దాదాపు 6 ఎకరాలకు పైగా కబ్జాకు గురైందన్నారు. 6 ఎకరాల పై చిలుకు భూమిని ఇప్పుడు కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేసి ప్లాట్లు వేసి అమ్ముకోవాలని చూస్తున్నారని ఆరోపించారు.తక్షణమే కలెక్టర్ స్పందించి, కబ్జాకు గురి కాబోతున్న 6 ఎకరాల పైచిలుకు భూమిని వక్ఫ్ బోర్డు వారు స్వాధీనం చేసుకొని ఇంటి స్థలము లేని ఇంటి అద్దె కడుతున్న పేద ముస్లింలకు ఒక్కొక్కరికి రెండు సెంట్ల ప్రకారం ఇంటి స్థలాలు ఇవ్వాలని, ఇల్లు కట్టుకోవడానికి ప్రభుత్వం నుండి రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీపీఐ, ఇన్సాఫ్‌ల ఆధ్వర్యంలో ముస్లింతో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించి, భూ పోరాటం చేసి, పేద ముస్లింలకు భూమిని పంచేందుకు సిద్ధంగా ఉన్నామని వారు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శులు మహేష్, శ్రీనివాసరావు, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి శ్రావణి రెడ్డి, నగర అధ్యక్ష, కార్యదర్శులు నాగేంద్రమ్మ, భారతి, నాయకురాలు ఆశా బేగం సోఫియా జరీనా బేగం రబియా మున్ని పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు మానుకోవాలి : టీడీపీ

విశాలాంధ్ర-పత్తికొండ: టీడీపీ ఎమ్మెల్యే కేఈ శ్యాం బాబుపై మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, జిల్లా ఉపాధ్యక్షులు సాంబశివారెడ్డిలు హితవు పలికారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని ఆర్థికంగా పూర్తిగా దివాలా తీయించారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను చక్కదిద్దుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు ఇటీవల ప్రకటించిన బడ్జెట్లో నిధులు కేటాయించడం జరిగింద న్నారు. అధికారంలోకి వచ్చిన 9 నెలల్లోనే ప్రతి గ్రామంలో 20 నుండి 30 లక్షల రూపాయల వ్యయంతో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు పూర్తిచేపట్టడం జరిగింద న్నారు. నియో జకవర్గ అభివృద్ధిపై తాము బహిరంగ చర్చకు సిద్ధమని తెలిపారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు రామానాయుడు, ముత్యాల తిరుపాల్, తిమ్మయ్య చౌదరి, బత్తిన లోకనాథ్, వెంకటపతి, కడవల సుధాకర్, చక్రాళ్ళ రాజు, తిప్పన్న, ఈశ్వరప్ప, శ్రీనివాసులు గౌడ్, చెన్నమ నాయుడు, మీరా హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

నివాస గృహాలు నిర్మించి, మౌలిక వసతులు కల్పించాలి

విశాలాంధ్ర - ఆదోని క్రైం: చాచా నెహ్రూ కాలనీ లబ్ధిదా రులకు నివాస గృహాలు నిర్మించి, మౌలిక వసతులు కల్పిం చాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అజయ్ బాబు, పట్టణ కార్య దర్శి సుదర్శన్ డిమాండ్ చేశారు. సోమవారం సబ్ కలెక్టరుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ 2004లో కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజ శేఖర్ రెడ్డి ఉన్నప్పుడు ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలనే సంకల్పంతో ఆదోని పట్టణంలో ఇంటి స్థలా లులేని లబ్ధిదారులను గుర్తించారన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుల నుంచి రూ.2100లు బ్యాంకుల ద్వారా డీడీ రూపంలో తీసుకొని ఆదోని పట్టణానికి ఐదు కిలోమీటర్ల దూరంలో సిరుగుప్ప రోడ్డు ప్రక్కన దాదాపు 2 వేల మందికి ఇంటి పట్టాలు మంజూ రు చేశారని తెలిపారు. 600 మంది లబ్ధిదా రులకు మాత్రమే ఇంటి స్థలాలు చూపిం చి, నాణ్యతలేని ఇల్లు నిర్మించా రని, మిగిలిన వాళ్లకు ఇంటి పట్టా ఇచ్చి ఇప్పటివరకు ఇంటి స్థలాలు చూపించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి 1400 మందికి ఇంటి స్థలాలు చూపించి, ప్రభుత్వ నిధులతో ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఐ సీనియర్ నాయకులు లక్ష్మి రెడ్డి, మండల కార్యదర్శి కలుబావిరాజు సహాయ కార్యదర్శి విజయ్ ఏఐటీయూసీ జిల్లా సమితి సభ్యులు హుసేని, ఏఐవైఎఫ్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు రంజిత్ గౌడ్ రమేష్, రైతు సంఘం నాయకులు ఎల్లప్ప, ఈరన్న, అస్లాం పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో..

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, మంగళవారం 18, మార్చి 2025

హైదరాబాదు నుంచి వచ్చి రాజకీయాలు చేస్తే చూస్తూ ఊరుకోం

విశాలాంధ్ర - హొళగుంద: కూటమి కార్యకర్తలను పట్టించుకోకపోతే తీవ్రంగా నష్టపోతామని, కూటమి కార్యకర్తలను, నాయకులను టీడీపీ ఇంచార్జీ కలుపుకొని పోవాలని మండల టీడీపీ కన్వీనర్ డాక్టర్ తిప్పయ్య కోరారు. స్థానిక సిద్దేశ్వర స్వామి రైస్ మిల్ ఆవరణంలో సోమవారం రాత్రి జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాగునీటి ఎన్నికల్లో రైతుల కాళ్లా, వేళ్లా పడి మిక్కిలినేని ప్రసాద్‌ను ఏకగ్రీవంగా గెలిపిస్తే కూటమి కార్యకర్తలను, నాయకులను పట్టించుకోకుండా గాలికి వదిలేసారని వాపోయారు. మాజీ టీడీపీ మండల కన్వీనర్ వీరన్న గౌడ మాట్లాడుతూ టీడీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎన్నో ఆందోళనలు, ధర్నాలు చేశామని పోలీసులు దెబ్బలకు భార్య, పిల్లలను వదిలి ఊరు విడిచామన్నారు. ఎలాంటి ఆందోళన చేయని వారు ఈరోజు పెత్తనం చేస్తామంటే సహించేలేదని గట్టిగా వార్నింగ్ ఇచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో కులం, ధర్మాన్ని వదిలి టీడీపీ అభ్యర్థి విజయా నికి తీవ్రంగా కష్టపడితే ఇదేనా మీరు ఇచ్చే గుర్తింపు అని ప్రశ్నించారు. ఏనాడు టీడీపీ కష్టపడని వారు ఈరోజు వచ్చి ఫ్లెక్సీలు కట్టి తామే టీడీపీ నాయకులు అంటూ డబ్బా కొట్టుకోవడం మంచి పద్ధతి కాదన్నారు. హైద రాబాదు నుండి వచ్చి రాజకీయం చేస్తామంటే ఊరుకో బోమని అన్నారు. ఓపికతో ఉన్నామని ఓపిక నశిస్తే ఎవరిని చూడమని బీసీ కార్పొరేషన్ రుణాలను వెంటనే రద్దుచేసి కూటమి కార్యకర్తలకు ఇస్తే ఆర్థికంగా ఎదగడమే కాకుండా ఉపాధి పొందడానికి ఎంతో అనుకూలంగా ఉంటుందన్నారు. కూటమి కార్యకర్తలను, నాయకులను కలుపుకొని ముందుకు వెళితే ఏకతాటిపై నడిస్తే వాటి ఎంతో భద్రంగా ఉంటుందని హితువు పలికారు. విలేకరుల సమావేశంలో టీడీపీ సీనియర్ నాయకులు ఇ.గోవింద గౌడ, దుర్గప్ప, పంపాపతి, అబ్దుల్ సుభాన్, మోయిన్, ఎర్రి స్వామి, దిడ్డి వెంకటేష్, కరూర్ వీరన్న, జే బసవ, హుస్సేన్ పీరా, దిడ్డి తిక్క స్వామి, మల్లికార్జున, మాజీ మండల బిజెపి కన్వీనర్ ప్రసాద్, జనసేన మండల కన్వీనర్ అశోక్ పాల్గొన్నారు.

నీళ్ల ట్యాంక్‌ని సందర్శించిన ఎన్ఎండీ ఫిరోజ్

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: నంద్యాల స్థానిక రాయల్ కాంపౌండ్‌లో 90 శాతం పనులు పూర్తిచేసి నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంకిని వార్డు ఇన్చార్జ్ కొండారెడ్డి ఆధ్వర్యంలో నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ సందర్శించారు. అనంతరం అక్కడ ప్రజలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో మంత్రి ఫరూక్ అప్పుడు ప్రారంభం చేసి 90 శాతం ట్యాంక్ నిర్మాణం పూర్తి చేయడం జరిగిందని, అనంతరం 2019లో ఎన్నికల కోడ్ రావడంతో ట్యాంక్ నిర్మాణం ఆగిపోవడం జరిగిందని, అనంతరం అధికారంలోకి వచ్చిన వైఎస్ఆర్సిపి 2019 నుంచి 2024 వరకు వాటర్ ట్యాంక్ నిర్మాణంలో ఎటువంటి పనులు చేయలేదని ఐదేళ్ల కాలయాపన చేయడం జరిగిందన్నారు. తదనంతరం 2024లో అధికారంలోకి టిడిపి రావడంతో ఫరూక్ నంద్యాల ఎమ్మెల్యేగా గెలవడం అనంతరం మంత్రి కావడంతో రాయల్ కాంపౌండ్ ప్రజలు వాటర్ ట్యాంక్ సమస్యను తీసుకుని వెళ్లి చెప్పడంతో ఇప్పుడు వాటర్ ట్యాంక్‌ని 100 శాతం పూర్తిచేసి ప్రజలకి అందుబాటులో తీసుకొస్తామని ఫిరోజ్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కృపాకర్, జోసఫ్, ఇసుక చాంద్, విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పది పబ్లిక్ పరీక్షలు

విశాలాంధ్ర - హొళగుంద: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి అరగంట ముందే వచ్చి చేరుకున్నారు. 11 మంది వికలాంగుల విద్యార్థులు తల్లిదండ్రులతో పడరాని పాట్లు పడి పరీక్షా కేంద్రాన్ని చేరారు. జిల్లా పరిషత్ హై స్కూల్ ఏ సెంటర్లో 172 మంది విద్యార్థులకు గాను 165 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఏడు మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజయ్యారు. బి.సెంటర్లో 174 మందికి గాను 169 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 5 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాలేదని డిపార్టమెంటల్ ఆఫీసర్ కబీర్ సాబ్ తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీలో 140 మంది విద్యార్థులకుగాను 139 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా కేవలం ఒక్క విద్యార్థి మాత్రమే పరీక్షలకు హాజరు కాలేదని డివో సుధాకర్, చీఫ్ ఆఫీసర్ రమణయ్య అన్నారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 120 మంది గాను 118 విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని ఇద్దరు మాత్రమే పరీక్షలకు హాజరు కాలేదని ఎంఈఓ సత్యనారాయణ తెలిపారు. పరీక్షల్లో ఎలాంటి మాస్ కాపీ జరగకుండా ఎస్సై బాల నరసింహులు పోలీస్ బందోబస్తు నిర్వహించారు. మొదటిరోజు కన్నడ, తెలుగు, ఉర్దూ, పరీక్షలు జరిగాయి.

చెరువులు, కుంటలకు నీటిని విడుదల చేయాలి

విశాలాంధ్ర - గూడూరు: మండలంలోని చెరువులు, కుంటలకు నీటిని నింపి ప్రజల దాహార్తి తీర్చాలని టీడీపీ మండల అధ్యక్షుడు జె.సురేష్ ఇరిగేషన్ అధికారులను కోరారు. సోమవారం కోడుమూరు మండలం ప్యాలకుర్తి గ్రామ సమీపంలోని ఎల్ఎల్సి కాల్వను పరిశీలించిన ఈఈ పాండు రంగన్నను జె.సురేష్ ఆధ్వర్యంలో కె.నాగలాపురం టీడీపీ నేతలు కలసి పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ వేసవి కాల దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. కె.నాగలాపురం చెరువుకు తక్షణమే నీటిని విడుదల చేస్తే మూడు గ్రామాల పరిధిలోని ప్రజలకు తాగునీటి సమస్య ఉండదన్నారు. ఇరిగేషన్ అధికారులు మాట్లాడుతూ తాగు నీటి సమస్య తలెత్తకుండా నీటిని విడుదల చేసినందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీ అధ్యక్షుడు ధర్మ రెడ్డి, నరసింహులు, ఇరిగేషన్ డీఈ సుబ్బరాయుడు, జేఈ మోహన్ రావు, లక్ష్మన్న, వర్క్ ఇన్‌స్పెక్టర్ మాదన్న తదితరులు ఉన్నారు.

భయాందోళనకు గురిచేసే చర్యలు చట్టరీత్యా నేరం

విశాలాంధ్ర- కోడుమూరు : సోషల్ మీడియాలో ఇన్‌స్టాగ్రామ్ వేదికగా కొందరు యువకులు భయాందోళనలు కలిగించే విధంగా పోస్టులు పెట్టడం చట్టరిత్యా నేరమని కోడుమూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎండి తబ్రేజ్ అన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం సాయంత్రం ఒక ప్రకటన విడుదల చేశారు. పలువురు యువకులు వివాహ వేడుకలు, పుట్టినరోజు వేడుకల సందర్భంగా రోడ్లపైకి చేరి కేకులు కట్ చేస్తూ, కత్తులు తల్వార్లు వంటి ఆయుధాలు చేత పట్టుకొని ఫోజులిచ్చి, అలాంటి ఫోటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేస్తున్నారని, ఇలాంటి చర్యలు చట్టరీత్యా నేరమన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన ఏడు గురిని కోడుమూరు, గూడూరు మండలాల్లో గుర్తించినట్లు చెప్పారు. గుర్తించిన వారిలో మొదటి చర్యగా భావించి కొందరు మైనర్లకు కౌన్సెలింగ్ చేసినట్లు తెలిపారు. మరికొందరిపై బైండోవర్ కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు.సోషల్ మీడియా వేదికగా భవిష్యత్తులో ఎవరైనా భయానకరమైన ఫోటోలు పోస్టు చేయడం లాంటి చర్యలకు పాల్పడితే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తొలి రోజు ప్రశాంతంగా పది పరీక్షలు

విశాలాంధ్ర - సి.బెళగల్ : మండలంలో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రారంభం అయ్యాయి. మోడల్ స్కూల్, గురుకుల పాఠశాల, కొత్తకోట, సి.బెళగల్ హైస్కూళ్లలో నాలుగు పరీక్ష కేంద్రాలుగా విద్యాధి కారులు ఏర్పాటు చేశారు. మండలంలోని ఈ కేంద్రాలలో సుమారు 1010 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 998 మంది హాజరు కాగా, 12 మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారు. ఆర్ఐ రమణ బాబు, కోడుమూరు విద్యాధికారి తైమున్ బాష, మండల ప్రత్యేక అధికారి శ్యామల పరీక్ష కేంద్రాలలో ప్రత్యేక యంత్రాంగంగా ఎస్సై తిమ్మారెడ్డి పర్యవేక్షణలో తనిఖీలు చేశారు. ఎవరూ మాస్ కాపీయియంగ్‌కు పాల్పడ కూడదని, పరీక్షలను విద్యార్థులు ధైర్యంగా నిర్భయంగా వాసి, ఉత్తీర్ణత సాధించాలని అధికారులు సూచించారు.

సుబ్బారెడ్డిని పరామర్శించిన బీసీ రాజారెడ్డి

విశాలాంధ్ర - బనగానపల్లె : బనగానపల్లె పట్టణానికి చెందిన నొస్సం పెద్ద వెంకట సుబ్బారెడ్డిని బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి పరామర్శించారు. ఇటీవల సుబ్బారెడ్డి బెంగళూరు ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో బైపాస్ సర్జరీ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న బీసీ రాజారెడ్డి సోమవారం సాయంత్రం కరెంట్ ఆఫీస్ ఏరియాలోని సుబ్బారెడ్డి ఇంటి వద్దకు వెళ్లి ఆయనను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో గాలి మద్దిలేటి రెడ్డి, రామ మద్దిలేటి రెడ్డి, ఎన్‌సీ సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షల శిబిరం

విశాలాంధ్ర - కోవెలకుంట్ల : కోవెలకుంట్ల పట్టణ పరిధిలోని స్థానిక సెయింట్ జోసెఫ్ స్కూల్ నందు సోమవారం జీవన్ జ్యోతి ట్రస్ట్ పెద్ద కొట్టాల వారి ద్వారా విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు శాంతిరం మెడికల్ కాలేజ్ ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. కరస్పాండర్ సిస్టర్ జాన్ మేరీ ప్రిన్సిపాల్ గీతా సిస్టర్ ఫాదర్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల సుమారు 200 మంది విద్యార్థులు వారి కంటి పరీక్షలు పరీక్షించుకొని తగిన మందులు ఇవ్వడం జరిగింది. ఇలాంటి కార్యక్రమాలు ఎన్నో జరగాలని స్కూల్ మేనేజ్మెంట్ తల్లిదండ్రులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ మర్ రెడ్డి, కంటి పరీక్షల వైద్యులు సిస్టర్స్, రోజా, బాల అండ్ ఉపాధ్యాయులు బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన తహశీల్దార్ భవనం నిర్మించాలి

విశాలాంధ్ర-గూడూరు: నూతన తహశీల్దార్ కార్యాలయాన్ని నిర్మించాలని గూడూరు పట్టణ అభివృద్ధి కమిటీ సభ్యులు తహశీల్దార్ కె.రామాంజనేయులును కోరారు. సోమవారం గూడూరు రెవెన్యూ కార్యాలయంలో పట్టణ అభివృద్ధి కమిటీ సభ్యులు సుభాకర్, టీచర్ నాగరాజు, టీడీపీ సీనియర్ నేత డి.సుందరజు తహశీల్దార్ కె.రామనేయులును కలసి నూతన తాసిల్దార్ భవనం నిర్మించాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 40 ఏళ్ల క్రితం నిర్మించిన తహశీల్దార్ కార్యాలయం 10 ఏళ్ల క్రితం శిధిలావస్థకు చేరి పైకప్పు పూర్తిగా పడిపోయిందని, తద్వారా సమీపంలోని చాలీచాలని గదులలో అధికార యంత్రాంగం ప్రభుత్వ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. దీంతో కార్యాలయాలకు వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నూతన భవన నిర్మానానికి నిధులు మంజూరు చేసి పనులు చేపట్టాలని వినతిపత్రంలో కోరారు. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి నూతన భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీఎస్, పట్టణ అభివృద్ధి కమిటీ సభ్యులు టీడీపీ ప్రజలు ప్రజలు తదితరులు ఉన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్ : న్యాయ సేవా అధికార సంస్థ వారు పంచాలింగాల గ్రామంలోని గవర్నమెంట్ మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలలో పోక్సో యాక్ట్‌పై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పి.పాండు రంగ రెడ్డి, ఆరవ అదనపు జిల్లా జడ్జి హాజరయ్యారు. జడ్జి మాట్లాడుతు అక్కడి మహిళలు పిల్లలకు పోక్సో యాక్ట్‌పై అవగాహన కల్పించారు. లైంగిక నేరాల నుండి రక్షణ చట్టం 2012 ప్రకారం పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన శిక్షలు కలవని తెలిపారు. ఈ పోక్సో కేసులను త్వరిత గతిన పరిష్కరించేందుకు ప్రత్యేక కోర్ట్ కలదని తెలిపారు. ఈ సదస్సులో ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, టీచర్స్ అనురాధలు పాల్గొన్నారు.

రవీంద్ర గ్లోబల్ స్కూల్లో అవగాహన కార్యక్రమం

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: స్థానిక కర్నూలు నగరంలోని పడిదంపాడు రోడ్డులోని రవీంద్ర గ్లోబల్ స్కూల్‌లో లిటిల్ సిఇఒస్ - ఆర్జిఎస్‌కోడ్ ప్రెన్యూర్ ఈవెంట్ ఘనంగాజరిగింది. ఈ కార్యక్రమం చిన్నారులలో వ్యాపార నైపుణ్యాలు, నాయకత్వం మరియు సృజనాత్మకతను పెంచడంలో ప్రత్యేక ప్రాధాన్యతను ఇచ్చింది. రవీంద్ర గ్లోబల్ స్కూల్ చైర్మన్ జి.వంశీధర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎం.గీతాశ్రీ హాజరయ్యారు. వీరు తెలంగాణ రాష్ట్రంలో ఇండస్ట్రీస్ డిపార్ట్మెంట్లో పనిచేస్తున్నారు. ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణలో 25 ఏళ్ల అనుభవంగల వీరు ఎంఎస్ఎంఈ పనితీరును మెరుగుపరచడంలో గొప్ప నిపుణులు. ఈ సందర్భంగా ఎం.గీత శ్రీ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలలో ఉన్న ప్రత్యేక నైపుణ్యాలను గుర్తించి, వారిని సరైన మార్గంలో నడిపితే వారి ముందు జీవితం ఎంతో ఆనందకరంగా ఉంటుందన్నారు. చిన్న వయసులోనే విద్యార్థులకు వ్యాపార నైపుణ్యాలు నేర్పితే భవిష్యత్తులో సాఫ్ట్వేర్ ,డాక్టర్ అనే పదాలు కాకుండా వీరే పదిమందికి ఉద్యోగము ఇచ్చే స్థాయికి చేరవచ్చన్నారు. అనంతరం రవీంద్ర గ్లోబల్ స్కూల్ ఛైర్మన్ జి.వంశీధర్ మాట్లాడుతూ రాబోయే కాలంలో ఈ చిన్నారులు సొంత ఆలోచనలతో వివిధ రకాల వ్యాపారాలకు అంకురార్పణ గావించి, గొప్ప పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి ఈ కార్యక్రమం బలమైన పునాది వేస్తుంది అన్నారు. తల్లిదండ్రుల సహకారంతో మా విద్యార్థులకు ఇలాంటి అద్భుతమైన కార్యక్రమాలను ఎప్పటికప్పుడు ఏర్పాటు చేస్తూ, విద్యార్థుల మేధో మదనానికి నిరంతరం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలోపాఠశాల సీఈవో జి.సుప్రియ, ప్రిన్సిపల్ ముంతాజ్ బేగం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కళ్యాణం.. కమనీయం.. గోరంట్ల మాధవుడి కళ్యాణం

విశాలాంధ్ర - కోడుమూరు: మండలంలోని గోరంట్ల గ్రామంలో వెలసిన శ్రీదేవి,భూదేవి సహిత శ్రీ లక్ష్మీ మాధవస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీ లక్ష్మీమాధవుడి కళ్యాణ మహోత్సవం కమనీయంగా సాగింది. సోమవారం తెల్లవారుజామున బ్రహ్మ ముహూర్తంలో వేద పండితుల వేదమంత్రోచ్చారణ మధ్య.. మంగళ వాయిద్యాలతో..అశేష భక్త జన వాహిని మధ్య గోవిందా.. గోవింద అంటూ నామ స్మరణలతో జరిపించిన శ్రీ లక్ష్మీ మాధవుడి కళ్యాణ మహోత్సవం ఎంతో కనుల పండుగగా జరిగింది. స్వామి అమ్మవార్ల కళ్యాణ మహోత్సవ వేడుకలు చూసేందుకు వందలాదిమంది భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కళ్యాణ మహోత్సవ వేడుకలకు ఎర్రగుడి, గోరంట్ల గ్రామ పెద్దలు పెళ్లి పెద్దలుగా వ్యవహరించారు. ఆదివారం అర్ధరాత్రి ఎర్రగుడి గ్రామస్తులు గరుడ సేవ కోసం తయారుచేసిన భారీ ప్రభను మేళతాళాలతో ఊరేగింపుగా గోరంట్ల మాధవస్వామి ఆలయం వద్దకు చేర్చారు. తెల్లవారుజామున ఇరువురు గ్రామస్తులు స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను కళ్యాణ వేదిక పైకి చేర్చి కళ్యాణానికి సిద్ధం చేశారు. అనంతరం వేద పండితులు వందవాసి రాధాకృష్ణ ఆచార్యుల ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య కళ్యాణ క్రతువు ప్రారంభించారు. మంగళ వాయిద్యాలు భక్తుల గోవిందా నామస్మరణల మధ్య స్వామి అమ్మవార్ల కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. అనంతరం గరుడోత్సవం కార్య క్రమంలో భాగంగా సోమ వారం ఉదయం శ్రీ లక్ష్మీ, మాధవుడి ఉత్సవ విగ్ర హాలను గరుడ వాహనం ప్రభపై ఉంచి, ఒకవైపు గోరంట్ల వాసులు, మరోవైపు ఎర్రగుడి వాసులు ఫోటో పోటీగా గరుడసేవ కార్యక్రమం చేపట్టారు. ఇరువురు గ్రామస్తులు పోటీపడి నిర్వహించే గరుడ సేవా కార్యక్రమం భక్తులను కనువిందు చేసింది. కళ్యాణ వేడుకలు, గరుడోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కోడుమూరు ఎస్సై ఏపీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు.

పది పరీక్షలు ప్రశాంతంగా రాయండి

విశాలాంధ్ర - బనగానపల్లె : పదో తరగతి పబ్లిక్ పరీక్షలను విద్యార్థిని, విద్యార్థులలు ప్రశాంతంగా రాయాలని పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి సూచించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ సోమవారం నుండి నియోజక వర్గంలోని ఆయా కేంద్రాల్లో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభమయ్యాయని, పరీక్షలు రాస్తున్న విద్యార్థులందరికీ బీసీ రాజారెడ్డి హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. నియోజవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు తనవంతు చేయూత నిచ్చేందుకు తల్లిదండ్రులు కీర్తిశేషులు బీసీ గుర్రెడ్డి, బీసీ లక్ష్మమ్మ దంపతుల జ్ఞాపకార్థం ప్రతిభా నగదు పురస్కారాలను ప్రకటించడం జరిగిందన్నారు. మండల స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించిన విద్యార్థికి రూ.50 వేల నగదు బహుమతి, మెమొంటో, జిల్లాస్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించిన విద్యార్థికి రూ.లక్ష నగదు బహుమతి, మెమెంటో అందజేయనున్నట్లు తెలిపారు.

పరీక్షా కేంద్రం ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతలు

విశాలాంధ్ర - డోన్ రూరల్: మండలంలోని పోతుదొడ్డి గ్రామంలో పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేసినందుకు ఆ పాఠశాల పూర్వ విద్యార్థులు బీకే నరసింహులు, రామచంద్రారెడ్డి విద్యాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. 65 సంవత్సరాల నుండి పాఠశాలలో విద్యనభ్యసించే విద్యార్థులు ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చుకొని ఇతర ప్రాంతాలకు వెళ్లి పరీక్షలు రాసేవారని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్ రెడ్డికి, ఉప విద్యా అధికారి వెంకట్రామిరెడ్డికి పోతు దొడ్డి పాఠశాల ప్రధానోపాధ్యాయునికి, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు.

పది పరీక్షలకు 20 మంది విద్యార్థులు గైర్హాజరు

విశాలాంధ్ర - రుద్రవరం: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో, నరసా పురం గ్రామంలోని సెయింట్ మార్తోమా ఉన్నత పాఠశాలలో 10 పరీక్షలు రాసేందుకు 20 మంది విద్యార్థులు గైర్హాజరు కావడం జరిగిందని ఎంఈఓ వీరరాఘవయ్య తెలిపారు. సోమవారం ఆయన తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 220 మంది విద్యార్థులకు గాను ఒకరు గైర్హాజరు కాగా, నరసాపురం లోని సెయింట్ మార్తోమా ఉన్నత పాఠశాలలో 178 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 19 మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారన్నారు. రెండు పరీక్ష కేంద్రాలలో పది పరీక్షలకు 398 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా సోమవారం 20 మంది గైర్హాజరు కావడం జరిగిందని ఆయన తెలిపారు. రుద్రవరంలోని ఉన్నత పాఠశాలలో ఏఎస్ఐ భూపాల్ రెడ్డి, నరసాపురం సెంటర్లో ఏఎస్ఐ బాలన్నలు గట్టి భద్రతను ఏర్పాటు చేశారు.

కౌలు రైతుల సంక్షేమం కోసం సమగ్ర చట్టాన్ని తేవాలి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : రాష్ట్రవ్యాప్తంగా కౌలు రైతుల రక్షణ సంక్షేమం కోసం సమగ్రమైన చట్టాలు ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగ న్నాథం డిమాండ్ చేశారు. సోమవారం కర్నూలు కలెక్టర్ కార్యాలయం ముందు ఏపీ కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి తిమ్మయ్య అధ్యక్షత వహిం చారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగ న్నాథం, జిల్లా కార్యదర్శి పంపన్న గౌడ్ పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు 80 శాతం మంది భూములను కౌలుకు తీసుకొని సాగు చేసుకుంటూ బ్రతుకు చున్నారన్నారు. ప్రభుత్వ సహాయ సహకారాలు ఏమాత్రం అందడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో దాదాపు గ్రామాలలో 60 శాతం మంది కౌలు రైతులు ఉన్నారని వారికి గుర్తింపు కార్డులు లేక, బ్యాంకు రుణాలు అందక ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రతి ఖరీఫ్ సీజన్‌లో గ్రామాలలో గ్రామ సభలు ఏర్పాటు చేసికౌలు రైతులం దరికీ గుర్తింపు కార్డులు బ్యాం కుల్లో పంట రుణాలు ఇవ్వాలని వారు తెలి పారు. ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి డి.శ్రీనివాసరావు, సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణా రెడ్డి, నగర సహాయ కార్యదర్శి సి.మహేష్, రైతు సంఘం నగర నాయకులు పుల్లన్న, రామాంజనేయులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కి వినతిపత్రం సమర్పించారు.

పని భారం తగ్గించాలి

విశాలాంధ్ర - బనగానపల్లె : పని భారం, పని ఒత్తిడి తగ్గించాలని పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవో వెంకటరమణకు వినతి పత్రం అందజేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం నందు పంచాయతీ కార్యదర్శిలు సంఘం ఆధ్వర్యంలో ఎంపీడీవో వెంకటరమణకు వినతి పత్రం అందజేశారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ గ్రామ సచివాలయం ద్వారా నిర్వహించే వివిధ రకాల సర్వేలు మిస్సింగ్ ఎంప్లాయ్ సర్వే, వర్క్ ఫ్రం హెూమ్ సర్వే, పి 4సర్వే, ఇవేకాక గ్రామపంచాయతీ పరంగా నిర్వహించే ప్రాథమిక విధులు ఉన్నట్లు తెలిపారు. ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శులకు పని భారం తగ్గించాలని కోరారు.

రాయల్ ఇంగ్లీషు మీడియం స్కూల్ ఆధ్వర్యంలో ఈద్ కీట్ల పంపిణీ

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : తాహెరా హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో రాయల్ స్కూల్ యాజమాన్యం వారు డాక్టర్ వి.యాకూబ్ వారి సోదరులు వి.ఇసాక్ వలి రమదాన్ నెల సందర్భంగా నిరుపేద ప్రజలకు జకాత్ రూపంలో 500 ఈద్ కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వి.యాకుబ్, అతవుల్లా ఖాన్ మాట్లాడుతూ ఇస్లాం ధర్మానుసారం సంపాదించిన మొత్తం నుండి జకాత్ తీయవలసి వుంటుందని, ఈ జకాత్ రూపంలో తీసిన డబ్బుతో గత 15 సంవత్సరాలుగా నిరుపేద కుటుంబాలకు ఈద్ కిట్లను పంపిణి చేయటం ఆనాయితీగా జరుగుతుందని, దీని ఫలితంగా పేద కుటుంబాలు కూడా అందరిలాగే పండుగను జరుపుకోవాలని స్థానిక నడిగడ్డలోని రాయల్ ఇంగ్లీషు మీడియం స్కూల్ ఆధ్వర్యంలో 500ల ఈద్ కీట్ల పంపిణీ కార్యక్రమం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు అబ్దుల్ హాది, ఎస్డీపీఐ పట్టణ అధ్యక్షులు ఏజాజ్, షరీఫ్‌లు రాయల్, నారాయణ స్కూల్ అధినేత ఇషాక్ వలి, ఖాజాహుస్సేన్, యూసుఫ్, నవభారత్ హుస్సేన్, శ్రీ సాయి వాణి స్కూల్ కరస్పాండెంట్ హుస్సేన్ బాష, ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.